సాక్షి
బాపట్ల
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.



19న ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కె.మల్లికార్జునరావు, కె.రామకోటేశ్వరరావు సోమవారం తెలిపారు.



బగళాముఖి సన్నిధిలో జిల్లా జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి అమ్మవారిని బాపట్ల జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ విశేషాలు కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

బాలాత్రిపుర సుందరిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రెండోరోజు బాలాత్రిపుర సుందరిదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. చండీ, రుద్రహోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశికచంద్రశేఖరశర్మ బాలాత్రిపుర సుందరిదేవి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండోరోజు అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా కటాక్షించారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

సాగర్ జలాలు వృథా చేయకండి


ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి



18వ మైలురాయి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి

శావల్యాపురం: సాగర్ జలాలు వృథా చేయరాదని నరసరావుపేట లింగగుంట్ల ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ డి.వరలక్ష్మి చెప్పారు. సోమవారం మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు విడుదలవుతున్న సాగర్ జలాల సామర్థ్యాన్ని ఎన్‌ఎస్పీ అధికారులు పరిశీలించారు. ఎస్‌ఈ వరలక్ష్మి మాట్లాడుతూ సాగర్ జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉన్నందున తాగునీటి కోసమే ప్రభుత్వం నీరు విడుదల చేసినట్టు వివరించారు. ఈ జలాలను పంటలకు వినియోగించొద్దని సూచించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 900 క్యూసెక్కులు తాగునీటి కోసం విడుదల చేయగా, అందులో ప్రకాశం జిల్లాకు 500 క్యూసెక్కులు కేటాయించినట్లు వివరించారు. ఈ కెనాల్ పరిధిలో 23 మంచి నీటి చెరువులు ఉండగా అన్నింటినీ నూరు శాతం నింపేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు మాత్రమే సాగర్ జలాలు విడుదలవుతాయని వెల్లడించారు. ఎస్‌ఈ వెంట ఎన్‌ఎస్పీ డీఈఈ చాట్రగడ్డ రామారావు, ఏఈ పొట్లూరి లక్ష్మీనారాయణ, లస్కర్ నందకిషోర్ తదితరులు ఉన్నారు.

28న జాబ్‌మేళా



నరసరావుపేట: పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ఈనెల 28న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించనున్న జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం లభిస్తుందని, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, ఫార్మసీ చదివిన 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మేళా జరుగుతుందని వెల్లడించారు. ఔత్సాహిక యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95817 94605, 80743 93466, 94409 88148 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ ఎంఆర్ కల్పశ్రీ, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూ సర్వే అర్జీలను పరిష్కరించండి

స్పందనలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



స్పందన అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ సర్వే సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. మండల స్థాయిలో సర్వేయర్లు భూముల సర్వే సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. జిల్లా స్పందన కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు ఈ క్రాప్, క్రాప్ బుకింగ్ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, సి.పి.ఒ. భరత్ కుమార్, డి.పి.ఒ. దాసరి రాంబాబు, డ్వామా పి.డి. శంకర్ నాయక్, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గోదాములను వచ్చేనెలలోగా పూర్తి చేయాలి

రైతులు పండించిన పంటల నిల్వ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన గోదాముల నిర్మాణాలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించి పనిచేయాలని చెప్పారు. జిల్లాకు 46 గోదాములు మంజూరు కాగా ఒక్కొక్కటి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.40 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 19 గోదాముల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. వీటిని తక్షణమే వినియోగంలోకి వచ్చేలా అధికారులు సహకరించాలని కోరారు. డెయిరీ ఉత్పత్తులు వృద్ధి చేయడం ద్వారా రైతుల ఆర్థిక వనరులు మెరుగు పడతాయని చెప్పారు. గేదెలను పశుపోషకులకు రుణం ద్వారా ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు, డీఈ పవన్, జిల్లా సహకార శాఖ అధికారి రామారావు, పీడీసీసీ బ్యాంక్ ప్రకాశం జిల్లా సీఈఓ ప్రకాష్, గుంటూరు సీఈఓ కృష్ణ వేణి పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు

బాపట్లలో దెబ్బతిన్న ప్రధాన రహదారులను అధికారులు తక్షణమే మరమ్మతులు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై నిలదీశారు. రహదారుల నిర్వహణకు రూ.1.64 కోట్ల నిధులు వచ్చినప్పటికీ మరమ్మతులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మరమ్మతులలో పురోగతి కనిపించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. ఆర్ అండ్ బీ ఎస్‌ఈ కిషోర్ బాబు, డీఈలు నరసింహారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- కిష్కిందపాలెంలో వైద్యశిబిరం



కిష్కిందపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ

కొల్లూరు: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజా ఆరోగ్యానికి శ్రీరామరక్షలా మారిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. మండలంలోని కిష్కిందపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, వైద్య సేవలు అత్యంత ఖరీదుగా మారిపోయి సామాన్య ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిన తరుణంలో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలను ప్రజలందరికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వద్దకే నేరుగా వైద్యులు వెళ్లడంతో సేవలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 616 మందికి బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతోపాటు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచులు గుంటూరు నీలాంబ్రం, టి.కృష్ణమోహన్, సూరపనేని వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్, వైద్యులు పావని, మౌనిక, కావ్యతేజ, బి.రాజ్‌కుమార్, ఎస్.సుష్మ పాల్గొన్నారు.

డిసెంబర్ 3న సాగర తీర క్రీడా మహోత్సవం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

చీరాల అర్బన్: జిల్లా సాగర తీర క్రీడా మహోత్సవం డిసెంబర్ 3న రామాపురం బీచ్‌లోని పెరల్ రిసార్ట్స్‌లో నిర్వహించనున్నట్లు రోటరీ డిస్ట్రిక్ట్ 3150 అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ క్లబ్‌లో మహోత్సవం బ్యానర్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి మొత్తం 115 రోటరీ క్లబ్‌ల నుంచి సుమారు 1,800 మంది సభ్యులు హాజరవుతారని చెప్పారు. కార్తిక మాసంలో ఉదయం నుంచి రాత్రి వరకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీవీ తుల సీరామ్, పోలుదాసు రామకృష్ణ, డీవీ సురేష్, సింగారావు, జీవై ప్రసాద్, గుర్రం రాఘవరావు, వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, ఎంవీ రామారావు, ఎస్‌వీ స్వామి, హరినారాయణ, బాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అశోక్‌కుమార్ సేవలు ఎనలేనివి

ఎంపీలు సురేష్, మోపిదేవి, ఎమ్మెల్యే కరణం



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం వేదికపై ఎంపీలు నందిగం, మోపిదేవి

చీరాల రూరల్: దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ బొనిగల అశోక్ కుమార్ సేవలు ఎనలేనివని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, ఎంపీలు నందిగం సురేష్, మోపిదేవి వెంకటరమణారావు కొనియాడారు. నూతనంగా స్థానిక సంఘం థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ బొనిగల అశోక్ కుమార్ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ అశోక్ కుమార్ పేదల పక్షాన నిలబడి వారికి నిత్యం సేవలందించేవారని కొనియాడారు. రాజకీయంగానే గాక కబడ్డీలో జాతీయ స్థాయి ఆటగాడిగా గుర్తింపు పొందాడని చెప్పారు. ఎంపీలు నందిగం సురేష్, మోపిదేవి వెంకట రమణారావు, మాజీ ఎంపీ జేడీ శీలం మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో అశోక్ కుమార్ వంటి దళిత నాయకుడు ఉండడం చీరాల ప్రజలకు వరమని కొనియాడారు. అయన పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, అశోక్‌కుమార్ సోదరుడు మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు, దేవరపల్లి బాబురావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆసాది అంకాల రెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

21 కిలోలు స్వాధీనం

చీరాల: అంతరాష్ట్ర గంజాయి ముఠాలో 12 మందిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో సోమవారం చీరాలలో స్వర్ణ రోడ్డులో గంజాయి విక్రయించే ముఠాగా ఉన్న ఏడుగురితో పాటు, గంజాయిని వినియోగించే మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి దగ్గర నుంచి ఒక మోటార్ బైక్‌తో పాటు, రూ.2.10 లక్షల విలువ చేసే 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠాను పట్టుకున్న చీరాల పోలీసులను ఎస్పీ అభినందించారు.

వేద స్వరూపిణి

- శ్రీగాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మ
- ప్రత్యేక కుంకుమార్చనలు, చండీహోమం
- భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు
- టికెట్లు ఉంటేనే వీఐపీ దర్శనం



చూసిన కనులదే భాగ్యం.. ఉత్సవమూర్తుల నగరోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సకల వేద స్వరూపిణి గాయత్రీదేవి. సకల మంత్ర సిద్ధి, తేజస్సు, జ్ఞానం.. గాయత్రీమాత దర్శనంతో కలుగుతాయని భక్తుల నమ్మకం. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి అలంకరణ, నిత్య పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. జయహో జగజ్జనని నామస్మరణతో ఇంద్రకీలాద్రి పరిసరాలు పులకించాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. తెల్లవారుజామున సర్వదర్శనం, టికెట్ల క్యూలైన్ ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. రెండో రోజు రద్దీ సాధారణంగానే కొనసాగింది. క్యూలైన్‌లో వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థాన అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆర్జిత సేవలకు డిమాండ్



ఆర్జితసేవల్లో ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద తెల్లవారుజామున ఐదు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన, అనంతరం ప్రత్యేక కుంకుమార్చన రెండు బ్యాచులు, శ్రీచక్రనవార్చన, చండీహోమంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలు ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు.



మనసారా.. అమ్మవారి సన్నిధిలో భక్తజనం



విధాత్రీ వేదజననీ.. ప్రత్యేక కుంకుమార్చనలు

ఐదు అంచెల బారికేడ్లు

ఉత్సవాల్లో తొలిరోజు ఘాట్‌రోడ్డు మీదగా భక్తులు వీఐపీ దర్శనాలు చేసుకోవడంపై వారికి అడ్డుకట్ట వేయడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని టోల్ గేట్, ఓం టర్నింగ్, సమాచార కేంద్రం, ఆలయ ప్రాంగణంలోని టికెట్ల కౌంటర్, లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ప్రత్యేకంగా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. దర్శనానికి వస్తున్న వారి వివరాలను ఆరా తీయడంతో పాటు వారికి జారీ చేసిన గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తున్నారు. గుర్తింపు కార్డులో వివరాలు సరిగా లేకపోయినా, నకిలీ కార్డు అని అనుమానం వచ్చినా వారిని సంబంధిత అధికారులకు అప్పగిస్తున్నారు. మరో వైపున సిఫార్సులతో వచ్చే వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయడంతో అనధికార దర్శనాలకు అడ్డుకట్ట పడినట్టైంది. వీఐపీ వాహనాల్లో కొండపైకి చేరుకునే వారు తప్పకుండా టికెట్లను కొనుగోలు చేయాల్సిందిగా దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. పున్నమి, సీతమ్మ వారి పాదాలు, బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణ నుంచి నడిపే వాహనాల్లో భక్తులను అనుమతించే ముందుగానే టికెట్లను తనిఖీ చేశారు. టోల్‌గేట్ వద్దకు చేరుకునే వాహనాల్లో ఉన్న భక్తుల టికెట్లను తనిఖీ చేసిన తర్వాతే కొండపైకి అనుమతించారు.



భక్తిశ్రద్ధలతో.. కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



సామాన్య భక్తులకే ప్రాధాన్యం : మంత్రి సత్యనారాయణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం మంత్రి కొట్టు సత్యనారాయణ కొండ దిగువ నుంచి క్యూలైన్లు పరిశీలించుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మధ్యలో భక్తులతో మాట్లాడుతూ అమ్మ దర్శనానికి వచ్చేటప్పుడు ఏమైనా సమస్యలు ఎదురయ్యాయా అని ఆరా తీశారు. క్యూలైన్‌లో భక్తులకు మంచినీళ్లు, పాలు అందుతున్నాయా అని తెలుసుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా భక్తులకు ఇబ్బంది కలిగితే అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. చిన్నపాటి సమస్యలు కూడా రాకుండా చూడాలన్నారు. అంతకు ముందు దేవస్థాన ఈవో కె.ఎస్.రామారావు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, దేవదాయ శాఖ అధికారులతో చర్చించారు. భక్తులకు ఇబ్బంది రాకుండా కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఏర్పాట్ల పరిశీలన

అమ్మవారి ఆలయం ప్రాంగణంలో క్యూలైన్లను మంత్రి కొట్టు సత్యనారాయణ పరిశీలించారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులతో మంత్రి మాట్లాడారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఆరా తీశారు. కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా ఆయా విభాగాల సిబ్బందితో చర్చించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించడానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లపై చర్చించారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం
- తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6 గంటలకు మహా మండపం నుంచి నగరోత్సవ సేవ
- సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారికి
- మహానివేదన, పంచహారతుల సేవ, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

కనుల పండువగా నగరోత్సవం

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల నగరోత్సవ సేవ సోమవారం కనుల పండువగా సాగింది. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి నగరోత్సవం ప్రారంభమైంది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్.రామారావు పూజా కార్యక్రమాలు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తజనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు ప్రారంభమైంది. మహామండపం, గోశాల, కనకదుర్గ నగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి, దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డు మీదగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

ఎస్పీ వకుల్ జిందాల్


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: జిల్లాలోని స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో స్పందన సోమవారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ 'స్పందన'లో బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'స్పందన' ఫిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. నిర్ణీత కాల వ్యవధిలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. స్పందనకు మొత్తం 61 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ మాలకొండయ్య పాల్గొన్నారు.

సాహిత్యంపై యువత దృష్టి సారించాలి


పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

బాపట్ల అర్బన్: కేవలం విద్య, ఉద్యోగాలకే పరిమితమైన నేటి తరం యువత ఉన్నత విద్యకు మూలస్తంభమైన సాహిత్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని బాపట్ల జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. శ్రీ భావపురి విద్యా సంస్థలు ప్రాంగణంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. బత్తుల మాట్లాడుతూ సమాజానికి హితం చేకూర్చే సాహిత్య పఠనం విద్యార్థుల భావి జీవితానికి చుక్కాని వంటిదని పేర్కొన్నారు. విజ్ఞానంతో పాటు మానసిక ప్రశాంతతను చేకూర్చే సాహిత్య గ్రంథాలు తెలుగులో అనేకం ఉన్నాయని చెప్పారు. వాటిని చదవడం ద్వారా తెలుగు భాషను కూడా అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోనే కాక త్వరలో చీరాల, పర్చూరు, అద్దంకి, మార్టూరు, వేమూరులలో కూడా యువ కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసి నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో సాహిత్య వికాసానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. చీరాలకు చెందిన ప్రముఖ కవి మరియు కథా రచయిత వడలి రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు కవిత్వం, కథా రచనలో శిక్షణ ఇచ్చేనందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ యు.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలు కూడా విశేష సంఖ్యలో ఇటువంటి సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహా కవుల కవితా విశేషాల గురించి ప్రసంగించారు. శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్యాన్ని విశ్లేషిస్తూ ప్రముఖ సాహితీ విమర్శకులు సజ్జా వెంకటేశ్వర్లు ప్రసంగించగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ కవి సమ్మేళనంలో పాల్గొన్న యువ కవులకు ప్రశంసా పత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ప్రముఖ రేడియో గాయకులు భాగి కృష్ణమూర్తి ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రముఖ చిత్రకారులు జి.వి. కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. సభా కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ నిర్వహించారు. ఆవుల వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు. అన్నం పూర్ణ చంద్ర రావు, పోలాసం వీరాంజనేయులు, డాక్టర్ కె.సుబ్బారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వంగర శ్రీధర్, షేక్ బాబావలి, మస్తాన్ వలి, ఆక్సీ, చామర్తి కిషోర్ పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా వెంకట రమణ బాధ్యతలు స్వీకరణ


జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఓ వెంకట రమణ

బాపట్ల: జిల్లా రెవెన్యూ అధికారిగా పసుపులేటి వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. కృష్ణ జిల్లాలో డీఆర్‌ఓగా పనిచేస్తున్న ఆయనను బాపట్ల జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ మేరకు జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటరమణ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏఓ గోపికృష్ణ ఉన్నారు.

ఉత్తరాఖండ్ జట్టుపై ఢిల్లీ విజయం

మంగళగిరి: వినూ మన్కడ్ అండర్– 19 పురుషుల క్రికెట్‌లో ఉత్తరాఖండ్ జట్టుపై ఢిల్లీ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సోమవారం మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరాఖండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 221 పరుగులు సాధించగా జట్టు బ్యాట్స్‌మెన్ అభ్యుదయ్ 113 బంతులలో సిక్స్, 5 ఫోర్లతో 79 పరుగులు, ఆరవ్ మహాజన్ 75 బంతులలో 4 సిక్స్‌లు, ఫోర్‌తో 58 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 37.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 222 పరుగులు సాధించి విజయాన్ని కైవసం చేసుకుంది. జట్టు బ్యాట్స్‌మెన్ ఆదిత్యకుమార్ 120 బంతులలో సిక్స్, 9 ఫోర్లతో 97 పరుగులతో నాటౌట్‌గా నిలిచి రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

లాకులపై భారీ వాహనాల రాకపోకలు నిలిపివేత


కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన వద్ద భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన గడ్డర్లు

కొల్లూరు: కొల్లూరు లాకుల వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాక్‌ల వంతెనలు శిథిలావస్థకు చేరడంతో ముందు జాగ్రత్తలు చేపట్టారు. సోమవారం లాక్ సెంటర్ ప్రాంతంలోని పశ్చిమ బ్యాంక్ కెనాల్, పడవల వంతెనలపై ఆటోలు, ద్విచక్ర వాహనాలు మినహా, లారీలు, ఇతర భారీ వాహనాలు రాకపోకలు జరపకుండా గడ్డర్లను ఏర్పాటు చేశారు. గతంలో పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన గోడ కూలిపోవడంతో అప్పట్లో ఈ వంతెనలపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి తిరిగి రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెనతో పాటు, పడవల కాలువ వంతెన పరిస్థితి అధ్వానంగా మారాయి. ఈ వంతెనలపై నుంచి 30 టన్నులకు మించి లోడుతో లారీలు ప్రయాణిస్తుండటంతో వంతెనలు మరింత బలహీనంగా మారడంతో వంతెనలపై భారీ వాహనాల రాకపోకలు నిలపాలని నీటిపారుదల శాఖాధికారులు నిర్ణయం తీసుకున్నారు. బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 13 లంక గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రధానమైన ఈమార్గం పూర్తిగా దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. లంక గ్రామాల నుంచి ఇటుక, ఇసుక, వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాలతో పాటు, ఆర్టీసీ బస్సులు దోనేపూడి, ఈపూరు గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుందని ఇరిగేషన్ జేఈ సాంబశివరావు తెలిపారు.



యార్డుకు 23,135 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 23,135 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 21,142 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ.24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,209 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మాఘ మహాకవి రచనలపై అవగాహన సదస్సు


ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై నందమూరి లక్ష్మీపార్వతి

ఏఎన్‌యూ: తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్తంగా మాఘ మహాకవి రచనలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఆచార్య వేణుగోపాల్ రెడ్డి సెమినార్ హాల్లో జరిగిన ఈ సదస్సుకు యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతిని కోరారు. మాఘ మహాకవి ఏడో శతాబ్దపు కవి అని, ఆయన రచనలు నేటికీ అందరి మనసుల్లో నిలుస్తాయని చెప్పారు. డాక్టర్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తెలుగు, సంస్కృత అకాడమీ ప్రగతిని వివరించారు. ఈ అకాడమీ నుంచి ఎన్నో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాఘ కవి ఎంతో ప్రతిష్టులని ఈ సందర్భంగా కొనియాడారు. వీసీ ఆలోచనను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెక్టార్ వరప్రసాద్ మాట్లాడారు. సదస్సులో సంస్కృత భాషకు విశిష్ట సేవలు అందించిన ఆచార్య కోగంటి శ్రీరంగనాయకి, ఉపద్రష్ట డాక్టర్ వెంకటరమణమూర్తిలకు ఘన సన్మానం చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి


కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: బాల్య వివాహాలు వ్యక్తిగతంగానే కాకుండా సామాజికంగానూ తీవ్ర హాని చేస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ ఆవరణ నుంచి బాల్య వివాహాలను అరికట్టాలని నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన మార్గదర్శకాలను రూపొందించిందన్నారు. సెప్టెంబర్‌లో జీఓ నెంబర్ 39 విడుదల చేసిందని చెప్పారు. వివాహ వయస్సు రాకుండా పిల్లలకు పెళ్లి చేయడం నేరమన్నారు. వారి ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుందని చెప్పారు. పాఠశాల, కళాశాల విద్యార్థులతోపాటు వసతి గృహాలు, రైల్వేస్టేషన్లు, గ్రామాల్లో దీనిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. దీంతోపాటు సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలు కూడా నిస్వార్థంగా పనిచేస్తున్నాయని చెప్పారు. వివాహానికి యువతులకు 18, పురుషులకు 21 నిండాలన్నారు. సేకరించిన డేటా ప్రకారం బాలికల్లో 70 శాతం రక్తహీనత ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల వివాహంపై కనీస అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల, సభ్యులు రాజకుమారి, దుర్గాభవాని, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వేగం పెంచండి

ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల వేగం పెంచాలని, యుద్ధప్రాతిపదికన వాటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు మంజూరు చేసిన పనులను నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు వెంటనే కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. పరిశుభ్రమైన మంచినీరు ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. గ్రామాల్లో సరఫరా అవుతున్న తాగునీటిని పరీక్షించే క్రమంలో కలుషిత నీటిని గుర్తిస్తే తక్షణం ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరు చేసిన పనులను శాఖాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులకు తక్షణం టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. దీంతోపాటు గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు చాలా వరకు పూర్తయ్యాయని, వాటిని త్వరగా అందుబాటులోకి తేవాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, ఈఈ త్రినాథ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు సమన్వయంతో నిర్వహించాలి..

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ముంగిటకే వైద్య సేవలందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి వైద్యులు, సిబ్బంది పూర్తి సహకారమందించాలన్నారు. క్యాంపుల్లో గుర్తించిన తీవ్ర జబ్బులకు సంబంధించి 15 రోజుల్లోనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స చేయించాలన్నారు. క్యాంపుల సందర్భంలో గుర్తించిన లోపాలను అధికారులు, వైద్యులు తదుపరి శిబిరాల్లో తలెత్తకుండా చూడాలని కలెక్టర్ వివరించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డీఈఓ శైలజ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్‌లలో మత్తు వైద్యుల పాత్ర కీలకం

గుంటూరు మెడికల్: ఆపరేషన్ సమయంలో మత్తు వైద్యుల పాత్ర ఎంతో కీలమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎనస్థీషియా డే సందర్భంగా సోమవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ చేయాలంటే తప్పనిసరిగా మత్తు వైద్యుడు అవసరమన్నారు. భరించలేని నొప్పి నుంచి రోగులను కాపాడేవిధంగా వైద్యులు పని చేస్తారన్నారు. ఎనస్థీషియా వైద్యులు ఒత్తిళ్లకు లోనవుతారని తెలిపారు. జీజీహెచ్‌కు మంచిపేరు తీసుకుని రావడానికి ఎనస్థీషియా వైద్యులు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. డాక్టర్ పోలయ్య, డాక్టర్ క్రిస్టాఫర్ పాల్గొన్నారు.

తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మాలేపాటి బాధ్యతలు స్వీకారం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మాలేపాటి హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ రాజీనామా ఆమోదం పొందటంతో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మాలేపాటి వ్యవహరిస్తారని కమిషనర్ ప్రకటించారు. దీంతో ఆయన మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కొన్ని ఫైల్స్‌పై సంతకాలు చేశారు.

జీఎంసీ ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌గా శ్రీనివాస్



నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన డెప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ అయిన పెద్ది రోజా సోమవారం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. పెద్ది రోజా స్థానంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌గా ప్రస్తుతం డెప్యూటీ కమిషనర్–2గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పిన కారు

- ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతుడు కేరళవాసిగా గుర్తింపు


మృతిచెందిన శ్రీనాథ్

పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీనాథ్(44) కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లోని ఓ ఫ్యాక్టరీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన భార్యను కేరళ రాష్ట్రం పంపించేందుకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కించాడు. అనంతరం తన స్నేహితులు నివసిస్తున్న గుంటూరు రూరల్ మండలంలోని అంకిరెడ్డిపాలెం వెళ్లి అక్కడ గోపాలకృష్ణ, ఓంప్రసాద్‌లను తన కారులో ఎక్కించుకుని హనుమాన్‌జంక్షన్‌కు బయలు దేరాడు. అర్ధరాత్రి సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు పెదకాకాని మండల పరిధిలో జాతీయ రహదారిపై బుడంపాడు రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. అతివేగంగా ఉన్న కారు డివైడర్‌ను ఢీ కొనడంతో కారులో ఉన్న శ్రీనాథ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు గోపాలకృష్ణ, ఓంప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. రహదారిపై వెళ్ళే వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనాథ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీ విభాగానికి తరలించారు. సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.